# టెస్టులకు రిటైర్మెంట్ యోచనలో కోహ్లీ

రోహిత్ బాటలోనే మాజీ సారథి • బీసీసీఐ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి



ఢిల్లీ: పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ క్రికెట్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకనున్నాడా? ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పిన కోహ్లీ.. టెస్టుల నుంచీ తప్పుకునేందుకు సిద్ధమయ్యాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇటీవలే సారథ్య బాధ్యతలతో పాటు టెస్టులకూ వీడ్కోలు పలికిన మాజీ సారథి రోహిత్ శర్మ బాటలోనే కోహ్లీ సైతం టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించేందుకు సమాయత్తమవుతున్నాడు. ఈ మేరకు కోహ్లీ ఇదివరకే ఈ విషయాన్ని బీసీసీఐకి తెలిపినట్టు బోర్డు వర్గాల సమాచారం. ఇంగ్లండ్ సిరీస్ కంటే ముందే దీనిపై కోహ్లీ ప్రకటన చేసే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. జనవరిలో ఆస్ట్రేలియాతో ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా కోహ్లీ పలుమార్లు ఈ విషయాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకొచ్చినట్టు వినికిడి. అయితే కీలకమైన ఇంగ్లండ్ పర్యటనకు ముందు బీసీసీఐ.. కోహ్లీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటుందా? లేక విరాట్ మనసు మార్చుతుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదివరకే రోహిత్ రూపంలో అత్యంత అనుభవజ్ఞుడిని కోల్పోయిన యంగ్ టీమ్‌ఇండియా.. ఇంగ్లండ్ పర్యటనలో కోహ్లీ గైర్హాజరీని తట్టుకుని నిలబడుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అభిమానులు సైతం రిటైర్మెంట్ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోహ్లీతో పాటు ఆ దిశగా అతడిని ఒప్పించాలని బీసీసీఐని అభ్యర్థిస్తున్నారు.

### మే 23న జట్టు ప్రకటన

ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును ఈనెల 23న ప్రకటించనున్నట్టు బోర్డు వర్గాల ద్వారా తెలుస్తున్నది. అదే తేదీన కొత్త సారథితో పాటు జట్టునూ వెల్లడిస్తారని సమాచారం. రోహిత్ స్థానంలో శుభ్‌మన్ గిల్ భారత జట్టును నడిపించడం ఖాయంగా కనిపిస్తున్నది.



# ఎల్ వీఆర్ బాస్కెట్‌బాల్ చాంప్ డీబీఏ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్‌వీబీఆర్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ వేదికగా జరిగిన ఎల్‌వీఆర్ స్మారక బాస్కెట్‌బాల్ టోర్నీ అట్టహాసంగా ముగిసింది. శనివారం జరిగిన వేర్వేరు విభాగపు ఫైనల్స్‌లో డీబీఏ(మహిళలు), సౌత్ సెంట్రల్ రైల్వే(ఎస్‌సీఆర్) చాంపియన్లుగా నిలిచాయి. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మహిళల తుది పోరులో డీబీఏ 61-42తో ఎన్‌బీఏపై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచి తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన మ్యాచ్‌లో డీబీఏ ప్లేయర్లు సత్తాచాటారు. కోర్టు మొత్తం కలియతిరుగుతూ కీలక పాయింట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. నేత్ర(26), మేధ(20) డీబీఏ టైటిల్ విజయంలో కీలకంగా వ్యవహరించారు. మరోవైపు పురుషుల ఫైనల్స్‌లో ఎస్‌సీఆర్ 66-49తో ఎన్‌బీఏపై గెలిచింది. గెలుపు కోసం ఇరు జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ఎస్‌సీఆర్ తరఫున సంతోష్(17), అజిత్(15) మెరుగ్గా రాణించగా, ఎన్‌బీఏ ప్లేయర్ బాలాజీ(20) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం(టీబీఏ) అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీబీఏ చైర్మన్ మసూద్ అహ్మద్, హైదరాబాద్ బాస్కెట్‌బాల్ ప్రతినిధులు పృథ్వీశ్వర్‌రెడ్డి, అమృత్ రాజ్ పాల్గొన్నారు. టోర్నీలో విజేతలకు 10వేలు, రన్నరప్ టీమ్‌లకు 5వేల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

# యుద్ధం ఆగింది.. ఐపీఎల్‌కు లైన్ క్లియర్!

పునరుద్ధరణ దిశగా బీసీసీఐ అడుగులు • ఆదివారం కీలక సమావేశం • విదేశీ ఆటగాళ్లను వెనక్కి రప్పించేందుకు యత్నాలు



ఢిల్లీ: దాయాదుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో వాయిదాపడ్డ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్).. ఇరుదేశాల కాల్పుల విరమణ ప్రకటనతో పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తున్నది. మే 8న ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ అర్ధాంతరంగా రద్దైన తర్వాత.. సరిహద్దుల్లో యుద్ధ తీవ్రత నేపథ్యంలో బీసీసీఐ ఈ లీగ్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే తాజా పరిణామాలతో బీసీసీఐ మళ్లీ ఈ లీగ్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నది. ఆటగాళ్ల భద్రత నేపథ్యంలో పలు ఫ్రాంచైజీలు ఇప్పటికే పలువురు ఆటగాళ్లను తమ దేశానికి పంపించాయని, ఇప్పట్లో ఈ లీగ్ జరగడం అనుమానమేనని వార్తలు వస్తుండగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ అనంతరం.. తాజా సీజన్‌ను జూన్ మొదటివారం లోపు పూర్తిచేయాలనే పట్టుదలతో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు ఆదివారం బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలితో కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఇదే విషయమై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. 'ప్రస్తుతానికి యుద్ధం ఆగింది. లీగ్ పునరుద్ధరణపై ఆదివారం బీసీసీఐ.. ఆఫీస్ బేరర్లు, అధికారులు, ఐపీఎల్ పాలకమండలి సభ్యులతో కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో సమీక్షించి తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది' అని తెలిపారు. అన్నీ కుదిరితే వచ్చే శుక్రవారం (మే 16న) ఐపీఎల్ తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### మూడు వేదికల్లో..!

సరిహద్దుల్లో ఏర్పడ్డ పరిస్థితుల నేపథ్యంలో లీగ్‌ను ఉత్తరాదిలో కాకుండా పూర్తిగా దక్షిణాదిలో నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. పాకిస్థాన్‌కు సరిహద్దు రాష్ట్రాల్లో ఉన్న అహ్మదాబాద్, జైపూర్, ధర్మశాల, చండీగఢ్‌లో కాకుండా దక్షిణాదిలోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో మ్యాచ్‌లను నిర్వహించడమే మంచిదని బీసీసీఐ భావిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. దీనిపై శుక్లా స్పందిస్తూ.. 'అవును. అది మా ఆప్షన్లలో ఒకటి. యుద్ధం జరుగుతున్నప్పుడు మేం చాలా ప్రత్యామ్నాయాలను పెట్టుకున్నాం. కాల్పుల విరమణను ఇప్పుడే ప్రకటించారు. మాకు కొంత సమయమివ్వండి. చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. 18వ సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచ్‌లు, 4 నాకౌట్ మ్యాచ్‌లు మిగిలున్న విషయం తెలిసిందే.



## త్వరలోనే ప్రారంభిస్తాం: ధుమాల్


వీలైనంత త్వరగా ఐపీఎల్‌ను పున:ప్రారంభిస్తామని ఈ లీగ్ చైర్మన్ అరుణ్ ధుమాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 'టోర్నీకి సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తాం. కానీ ఇక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో పలువురు విదేశీ క్రికెటర్లు ఇప్పటికే తమ సొంత దేశానికి వెళ్లిపోయారు. వారిని ఒప్పించి తిరిగి లీగ్ విజయవంతంగా జరిగేలా చూడటం మా ముందున్న అతిపెద్ద సవాల్' అని చెప్పారు. ఇదిలాఉండగా ఐపీఎల్ వారం రోజులు వాయిదాపడటంతో విదేశీ క్రికెటర్లతో పాటు పలువురు భారత క్రికెటర్లూ సైతం తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు.



## స్క్వాష్‌లో శుభారంభం

చికాగో (యూఎస్‌ఏ): వరల్డ్ స్క్వాష్ చాంపియన్‌షిప్స్‌లో భారత ఆటగాళ్లు అన్హత్ సింగ్, అభయ్ సింగ్, వీర్ ఛత్రోని, రమిత్ టాండన్ శుభారంభం చేశారు. శుక్రవారం రాత్రి జరిగిన తొలి రౌండ్ పోటీలలో భాగంగా మహిళల సింగిల్స్‌లో 17 ఏండ్ల అన్హత్.. 3-2 (10-12, 11-9, 6-11, 11-6, 11-6)తో ప్రపంచ 28వ ర్యాంకర్ మరీనా స్టెఫనొని (అమెరికా)కి షాకిచ్చింది. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో అభయ్.. 3-2తో నికోలస్ (స్విట్జర్లాండ్)ను చిత్తు చేయగా మరో పోరులో ఛత్రోని.. 3-1తో డెక్లాన్ జేమ్స్ (బ్రిటన్)ను ఓడించాడు. రమిత్.. 3-1తో సుకుయ్ (జపాన్)ను షాకిచ్చి రెండో రౌండ్‌కు ప్రవేశించాడు.

## సెమీస్‌లో ముగిసిన పోరాటం



తైవాన్: తైపీ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్-300 టోర్నీలో తమ కంటే మెరుగైన ర్యాంకు కలిగిన షట్లర్లను మట్టికరిపించిన భారత యువ షట్లర్లు ఉన్నతి హుడా, ఆయుష్ శెట్టి పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్‌లో ఉన్నతి.. 19-21, 11-21తో టొమొక మియజకి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి గేమ్‌లో కాస్త ప్రతిఘటించిన ఉన్నతి.. ప్రత్యర్థి దూకుడుతో రెండో గేమ్‌లో తేలిపోయింది. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ఆయుష్.. 18-21, 17-21తో తైవాన్‌కు చెందిన ప్రపంచ ఏడో ర్యాంకర్ చో టైన్ చెన్ జోరుకు తలవంచాడు.

## స్వియాటెక్‌కు షాక్

రోమ్ (ఇటలీ): మరికొద్దిరోజుల్లో మొదలుకాబోయే ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు మహిళల టెన్నిస్ టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్)కు ఊహించని షాక్ తగిలింది. ఇటాలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో స్వియాటెక్.. 1-6, 5-7తో డానియల్ కొలిన్స్ (అమెరికా) చేతిలో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో స్వియాటెక్‌కు ఇది తొమ్మిదో పరాజయం. కొలిన్స్ దూకుడు ముందు పోలండ్ బామ తేలిపోయింది.



## అఫ్జల్ కొత్త రికార్డు

దుబాయ్: యూఏఈలో జరుగుతున్న యూఏఈ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో భారత యువ అథ్లెట్ మహ్మద్ అఫ్జల్.. పురుషుల 800 మీటర్ల పరుగు పందెంలో సరికొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. రేసును 1:45.61 నిమిషాల్లోనే పూర్తిచేసిన అతడు.. 2018లో జిన్సన్ జాన్సన్ నెలకొల్పిన 1:45.62 రికార్డును అధిగమించాడు. తాజా ప్రదర్శనతో అతడు రజతం కూడా గెలుచుకున్నాడు.

# ఆర్చర్ల పతకాల పంట

రజతం గెలిచిన జట్టులో పెద్దపల్లి అమ్మాయి

- భారత్‌కు ఒకేరోజు ఐదు మెడల్స్
- అదరగొట్టిన మధుర
- ఆర్చరీ ప్రపంచకప్



మధుర





చికిత

షాంఘై (చైనా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో భారత ఆర్చర్లు పతకాల పంట పండించారు. గురి తప్పని లక్ష్యంతో భారత్‌కు ఒకే రోజు ఐదు పతకాలు అందించారు. శనివారం జరిగిన కాంపౌండ్ విభాగంలో రెండు స్వర్ణాలు, ఒక రజతంతో పాటు రెండు కాంస్యాలు సాధించారు. అమరావతి (మహారాష్ట్ర)కి చెందిన 24 ఏండ్ల యువ ఆర్చర్ మధుర.. ఒకేరోజు స్వర్ణం, రజతం, కాంస్య ప్రదర్శనతో అదరగొట్టింది. తన కెరీర్‌లో రెండో ప్రపంచకప్ ఆడుతున్న ఈ అమ్మాయి.. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంతో పాటు ఉమెన్స్ టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్ టీమ్ పోటీల్లోనూ పతకాలు సాధించింది. వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్‌లో మధుర.. 139-138 కార్సన్ క్రాహేను ఓడించి స్వర్ణం సొంతం చేసుకుంది. ఉమెన్స్ కాంపౌండ్ టీమ్ ఫైనల్‌లో మధుర, జ్యోతి సురేఖ, చికితతో కూడిన భారత త్రయం.. 221-234తో మెక్సికో చేతిలో ఓడినా రజతం దక్కింది. చికితది పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామం కావడం విశేషం. ఇక ఇదే విభాగంలోని మిక్స్‌డ్ టీమ్ కాంస్య పోరులో.. మధుర-అభిషేక్ ద్వయం 144-142తో మలేషియాను ఓడించి పతకం దక్కించుకుంది. అంతకుముందు పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ఫైనల్‌లో అభిషేక్, ఒజాస్, రిషభ్.. 232-228తో మెక్సికోను ఓడించి పసిడి గెలిచారు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ కాంస్య పోరులో 22 ఏండ్ల రిషభ్.. 145-145తో కిమ్ జొంగో (దక్షిణ కొరియా)ను ఓడించాడు. ఇరువురి స్కోర్లు సమం కాగా షూటాఫ్‌లో రిషభ్ మెరుగైన స్కోరుతో పతకం సాధించాడు.

# కామెడీ పండించడం పెద్ద ఛాలెంజ్

ప్రస్తుతం టాలీవుడ్ టాప్ కమెడియన్ ఎవరంటే టక్కున వచ్చే సమాధానం వెన్నెల కిశోర్. వల్గారిటీకి దూరంగా హెల్దీ కామెడీతో.. అద్భుతమైన టైమింగ్‌తో ఆడియన్స్‌ని అలరిస్తుంటారాయన. ఇప్పుడు టాలీవుడ్‌లో వెన్నెల కిశోర్ టైమ్ నడుస్తున్నది. దర్శకనిర్మాతలకు ఓ సెంటిమెంట్‌గా మారిపోయారు వెన్నెల కిశోర్. ఆయనకి సరైన క్యారెక్టర్ పడితే సినిమా హిట్ అనేది వారి ప్రగాఢ నమ్మకం. రీసెంట్‌గా విడుదలైన '#సింగిల్'లో హీరో శ్రీవిష్ణు ఫ్రెండ్‌గా మంచి పాత్ర చేశారాయన. ఈ సినిమా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోందని వెన్నెల కిశోర్ ఆనందం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో ముచ్చటించారు.



మనం చికెన్ బిర్యాని తింటున్నప్పుడు అప్పుడప్పుడు లివర్ పీస్ తగులుతుంటుంది. అది బిర్యానీకి డిఫరెంట్ టేస్ట్‌ని తెస్తుంది. ఇందులో నా క్యారెక్టర్ అలాంటిదే. హీరో శ్రీవిష్ణు స్పాంటేనియస్‌గా డైలాగుల్ని ఇంప్రువైజ్ చేసేస్తారు. అతని పక్కన, అంతే స్పాంటేనియస్‌గా రియాక్షన్ ఇచ్చే యాక్టర్ ఉండాలి. దానికి నేనైతే కరెక్ట్ అని డైరెక్టర్ కార్తీక్‌రాజ్ భావించారు. శ్రీవిష్ణు ఉండే ప్రతి సన్నివేశంలో నేను కూడా ఉండాలని ఆయన ఫిక్స్ అయ్యారు. ఆ ఆలోచన స్క్రీన్‌పై బాగా వర్కవుట్ అయ్యింది. ఈ కథ విన్నప్పుడే హిలేరియస్‌గా అనిపించింది. అదే ఎంటర్‌టైన్మెంట్ తెరపై కూడా పండింది. నిజంగా నా సినిమాను నేను స్క్రీన్‌పై చూసుకోలేను. కానీ ఈ సినిమాను మాత్రం థియేటర్లో ఆడియన్స్‌తో కలిసి చూశా. ఆ రెస్పాన్స్ నాకు చాలా ఆనందాన్నిచ్చింది.

- రచయిత కొత్త ఆలోచనలతో వస్తేనే కామెడీ పాత్రలు కొత్తగా వస్తాయి. నిజానికి ఎక్కువశాతం రెగ్యులర్ పాత్రలే వస్తుంటాయి. కానీ వాటిని కూడా ఓన్ చేసుకొని, అందులోనే ఏదో ఒక యూనిక్నెస్‌ని ప్రజెంట్ చేసేలా ప్రయత్నిస్తే, పాత్ర పాతదైనా చూసేవాళ్లకు కొత్తగా అనిపిస్తుంది. నేను చేసేది అదే. నావల్ల ఒక సీన్ బాగా వస్తే అది నాకు గొప్ప ఆనందాన్నిస్తుంది. ప్రతి మనిషికీ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. దానికి దూరంగా.. తనది కానీ ప్రపంచంలోకి ఎంటరై, వేరే వ్యక్తిత్వాన్ని ఆకళింపు చేసుకొని నటించే పాత్రలంటే నాకు ఇష్టం. గీతగోవిందం, అమీతుమీ చిత్రాల్లో నేను చేసిన పాత్రలే అందుకు ఉదాహరణ.
- ప్రస్తుత పరిస్థితుల్లో కామెడీ పండించడం పెద్ద ఛాలెంజ్. వినోదం అనేది మనిషి చేతుల్లోకి వచ్చేసింది. ఫోన్ ఓపెన్ చేస్తే రీల్స్. బోలెడన్ని కామెడీ వీడియోలు. థియేటర్లకు వచ్చి ఆడియన్స్ ఎంజాయ్ చేయాలంటే అంతకు మించి వినోదం ఇవ్వాలి. అలాంటి పాత్రలు కుదరాలి.
- హీరోగా అవకాశాలు వస్తున్నాయి కానీ.. లవ్‌స్టోరీలు, పాటలు అంటుంటే ఇబ్బందిగా ఉంది. అలాంటివి నాకు సూట్ కావు. ప్రాపర్ కామెడీ కథ కుదిరితే తప్పకుండా హీరోగా చేస్తా. నాకు డ్రీమ్ రోల్స్ అంటూ ఏమీ లేవు. 'దూకుడు'తోనే నా డ్రీమ్ రోల్ అయిపోయింది. మహేష్‌బాబుగారి పక్కన మంచి క్యారెక్టర్ చేయడం నా డ్రీమ్. అది తీరిపోయింది. ఇప్పుడు చేస్తున్నదంతా బోనస్.

చిత్రం



## అలాంటి పాటలో మళ్లీ నటించనేమో..


**సమంతతో** కాసేపు మాట్లాడితే జీవితాన్ని తాను ఎంత కాచి వడపోసిందో అర్థమవుతుంది. వేదాంత ధోరణితో పాటు ఆత్మవిశ్వాసం కూడా ఆమె మాటల్లో తొణికిసలాడుతుంది. రీసెంట్‌గా తను నిర్మించిన 'శుభం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు సామ్. 'కెరీర్ ప్రారంభంలో వరుస విజయాలు చూశా. నన్నంతా 'గోల్డెన్ లెగ్ ఆఫ్ తెలుగు సినిమా' అన్నారు. ఒక్కసారిగా ఫ్లాప్ వచ్చింది.. భరించలేకపోయా. దాంతో సక్సెస్‌పై నా దృష్టిలో నిర్వచనమే మారిపోయింది. అది శాశ్వతం కాదని అర్థమైంది. ప్రస్తుతం నేను సక్సెస్‌లో లేనని చాలామంది అంటున్నారు. నిజానికి నేను సక్సెస్‌లోనే ఉన్నా. గతంతో పోలిస్తే ఇప్పుడే విజయవంతంగా రాణిస్తున్నా. నచ్చినట్టు బతకడమే కదా సక్సెస్.' అన్నారు సమంత. కాస్త విరామం తర్వాత 'రక్త్ బ్రహ్మాండ్' షూటింగ్‌లో పాల్గొన్నానని, బ్రేక్ తీసుకోవడం వల్లనేమో.. యాక్టింగ్ కష్టం అనిపించిందని సమంత చెప్పారు. 'జీవితం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 'ఊ అంటావా' పాట ఆఫర్ వచ్చింది. అలాంటి పాట నేనెప్పుడూ చేయలేదు. నాకు నేను హాట్ గర్ల్‌గా ఎప్పుడూ అనుకోలేదు. అసలలా ఊహించను కూడా. సెట్‌లో అడుగుపెట్టినప్పుడు కాస్త కంగారు పడినా.. ధైర్యం కూడగట్టుకొని, సవాలుగా తీసుకొని ఆ పాట చేశా. మళ్లీ అలాంటి పాటలో యాక్ట్ చేస్తాననుకోవడం లేదు.' అని తెలిపారు సమంత. తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణం అభిమానులేనని, అందుకే వాళ్లు ఎప్పుడైనా ఫొటోలు అడిగితే కాదననని, తన తండ్రి మరణవార్త తెలిసి ఇంటికి వెళ్తున్న సమయంలో కూడా ఎయిర్‌పోర్ట్‌లో తనను ఫొటోలకోసం రిక్వెస్ట్ చేశారని, వారికోసం అంత బాధలోనూ నవ్వుతూనే ఫొటోలు దిగానని సమంత గుర్తు చేసుకున్నారు.

# శైలేష్‌తో కామెడీ సినిమా చేస్తా!



'దేశంలో పరిస్థితి సెన్సిటివ్‌గా ఉంది కదా.. ఇలాంటి సమయంలో సినిమా సెలబ్రేషన్స్ చేయడం కరెక్టేనా.. అనే చర్చ మా మధ్య జరిగింది. ఓవైపు శత్రువులు మన దేశంలో సృష్టించిన రక్తపాతానికి, సరిహద్దుల్లో మన సైనికులు సరైన సమాధానం చెబుతున్నారు. తాము చేసిన దుశ్చర్య వల్ల ఇండియాలో ఒకచోట సెలబ్రేషన్స్ క్యాన్సిల్ అయ్యాయి.. అనే సాటిస్ఫాక్షన్ కూడా శత్రువులకు మేం ఇవ్వదలచుకోలేదు. అందుకే ఈ సెలబ్రేషన్స్ చేస్తున్నాం' అని నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'హిట్: The 3rd case'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఈ నెల 1న సినిమా విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ సక్సెస్‌మీట్‌లో నాని మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఒక క్రైమ్ థ్రిల్లర్‌ని ఒక బిగ్ మాస్ కమర్షియల్ సినిమాగా సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సందర్భంగా ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నాను. దర్శకుడు శైలేష్‌తో వర్క్ చేయడం ఫన్‌గా ఉంటుంది. తను చాలా కూల్. అద్భుతమైన కామెడీ టైమింగ్ కూడా తనలో ఉంది. తనతో నేను చేయబోయే నెక్స్ట్ సినిమా కామెడీ ఎంటర్‌టైనర్ అవ్వాలని కోరుకుంటున్నా. అలాగే 'హిట్ 2' సందడి థియేటర్లలో కంటిన్యూ కావాలని ఆశిస్తున్నా.' అని పేర్కొన్నారు నాని. ఇంకా శైలేష్ కొలను, అడివి శేషు, శ్రీనిధి శెట్టి, ప్రొడ్యూసర్ దీప్తి, పావని, శ్రీనాథ్ మాగంటి, అమిత్, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర కూడా మాట్లాడారు.

## దీపావళికి 'డ్యూడ్'



'లవ్‌టుడే' 'డ్రాగన్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యాడు తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'డ్యూడ్'. కీర్తిశ్వరన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. మమిత బైజు కథానాయిక. శనివారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో హీరో ప్రదీప్‌రంగనాథన్ చేతిలో మంగళసూత్రం పట్టుకొని ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు.

## నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్




మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకుడు. బి.బాలకృష్ణ, సీ.రామ శంకర్ నిర్మించారు. చిత్రీకరణ పూర్తయింది. జూన్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. దీపా ఆర్ట్స్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాయి. తెలంగాణ గ్రామం నేపథ్యంలో నడిచే కథ ఇదని, పాత్రలన్నీ సహజంగా ఉంటాయని, రెండు గంటలు నాన్‌స్టాప్‌గా నవ్విస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమా తీశామని నిర్మాత పేర్కొన్నారు.

## క్రైమ్ థ్రిల్లర్ 'కథకళి' ప్రారంభం



బ్రహ్మాజీ, యశ్వంత్ పెండ్యాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'కథకళి' శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రసన్న కుమార్ నాని దర్శకుడు. మాన్యత ప్రొడక్షన్స్ పతాకంపై రవికిరణ్ కదిలిండి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిహారిక కొణిదెల క్లాప్‌నివ్వగా, హర్షిత్ రెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో నడిచే క్రైమ్ థ్రిల్లర్ ఇదని, వినోదానికి కూడా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని, ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని నిర్మాత పేర్కొన్నారు. మధు దామరాజా, మైమ్ మధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జితిన్ మోహన్, సంగీతం: పవన్, దర్శకత్వం: ప్రసన్నకుమార్ నాని.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.